## క్లుప్తంగా

### బాధ్యతల స్వీకరణ




రేగొండ: రేగొండ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా రాజేశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై సందీప్ కుమార్ భూపాలపల్లి వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. కాగా, రామగుండం కమిషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ ఎస్సైగా విధులు నిర్వర్తించే రాజేశ్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేశ్ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

### రేషన్ కార్డుల పంపిణీ

పలిమెల: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను విచారించి కొత్త, ఇదివరకే ఉన్న రేషన్ కార్డులల్లో మార్పులు, చేర్పుల విచారణ చేపట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేపట్టినట్లు తహసీల్దార్ అనిల్ మంగళవారం తెలిపారు. దీంతో మండలంలో ఇప్పటి వరకు 382 కొత్త రేషన్ కార్డులు అందించినట్లు తెలిపారు. అలాగే రేషన్ కార్డులల్లో 605 మందిని జోడించడం పేర్కొన్నారు. ఇంకా ఏవరైనా అర్హులు రేషన్ కార్డు దరఖాస్తు చేసుకొని వారుంటే వెంటనే సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: సమగ్రశిక్ష తెలంగాణ, భారత కృతిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా సమీకృత విద్య సమన్వయకర్త(సీఎంఓ) సామల రమేశ్ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరైనట్లు పేర్కొన్నారు. బెంగుళూరు చెందిన అలింకో సంస్థకు చెందిన వివిధ డాక్టర్లు హాజరై దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 80 మందికి ఉపకరణాలు అవసరమని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవానాయక్, ఎంపీడీవో నాగరాజు, డాక్టర్లు, ఐఆర్‌పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అడ్‌హక్ కమిటీని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మంగళవారం ప్రకటించారు. కమిటీ కన్వీనర్‌గా పెండ్యాల రంజిత్, కో–కన్వీనర్లుగా రాజేందర్, మార్క మురళీకృష్ణ, దేంచనాల తిరుపతి, సభ్యులుగా సల్పాల తిరుపతి, మేశినేని పూర్ణచందర్ రావు, బత్తుల మహేష్, దేవేందర్‌చారి తదితరులు ఎన్నికయ్యారు.

### రేగొండలో కల్తీ బీరు కలకలం

రేగొండ: రేగొండలోని ఓ మద్యం షాపు ద్వారా బెల్ట్ షాపునకు తరలించిన కల్తీబీరు సంఘటన కలకలం రేపింది. రేగొండ మండలం భాగిర్తిపేట గ్రామానికి చెందిన దుగ్యాల స్వామి అనే వ్యక్తి గ్రామంలోని ఓ బెల్ట్ షాపులో బీర్ తీసుకున్నాడు. ఈ బీరు కొద్దిగా తాగడంతోనే అస్వస్థతకు గురై వాంతులు చేసుకున్నాడు. కల్తీ బీరు ఇచ్చావని బెల్ట్ షాపు నిర్వాహకుడిని నిలదీయగా రేగొండలోని లక్ష్మీనరసింహ వైన్స్ నుంచి బీర్లు తీసుకువచ్చినట్లు తెలిపాడు. దీంతో బాధితుడు రేగొండలోని వైన్స్ వద్ద కల్తీ బీరు బాటిల్ ఇచ్చావంటూ మద్యం షాపులోని వ్యక్తితో వాగ్వాదానికి దిగాడు. మళ్లీ షాపు ముందు వాంతులు కావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇలాంటి షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం: కాటారం మండలం విలాసాగర్ మానేరు వాగు నుంచి భూపాలపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను మంగళవారం మండలంలోని మేడిపల్లి టోల్‌గేట్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు విక్రయించడం కోసం ఆరు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ఇందులో మండలంలోని గంగారానికి చెందిన రెండు ట్రాక్టర్లు, భూపాలపల్లికి చెందిన నాలుగు ట్రాక్టర్లుగా గుర్తించారు. ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

### ఆరోగ్యశ్రీ నిరుపేదలకు వరం

చిట్యాల: ఆరోగ్యశ్రీ నిరుపేదలకు వరం అని మండల కేంద్రానికి చెందిన ఆరోగ్యమిత్ర గుర్రపు రాజమౌళి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వెంకట్రావుపల్లి(సీ)గ్రామానికి చెందిన రంపీస లింగాబాయి అనే వృద్ధురాలు ఈనెల10న ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడినట్లు తెలిపారు. దీంతో ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు ఆరోగ్యశ్రీ ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ వైద్యులు పరీక్షించి తెల్లరేషన్ కార్డు ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆమెకు ఉచితంగా ఆపరేషన్ చేసినట్లు తెలిపారు.

# సమృద్ధిగా వర్షాలు

- నిండిన చెరువులు, పొంగిన చలివాగు, మానేరు
- ముమ్మరంగా వరి సాగు చేస్తున్న అన్నదాతలు


వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

టేకుమట్ల: వానాకాలం ఆరంభం నుంచి సరైన వర్షాలు లేక రైతులు ఆందోళన చెందారు. వానాకాలంలో సైతం మండుటెండ కొట్టడంతో పంటలు పండుతాయా లేదా అనే సందిగ్ధంలో పడ్డారు. కొన్ని రోజుల వరకు చలివాగు మానేరుల పరివాహక రైతులు నాట్లు వేసేందుకు వెనకడుగు వేశారు. కాగా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులు నుండి చలి వాగు మానేరు సైతం పొంగడంతో అన్నదాతలు ఆనందంతో ఉన్నారు. వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

**వరి సాగు వివరాలు..**

మండలంలోని చలివాగు మానేరు పరివాహక గ్రామాలైన సుబ్బక్కపల్లి, సోమనపల్లి, అంకుషాపూర్, టేకుమట్ల, ఆసిరెడ్డిపల్లి, రాఘవరెడ్డిపేట, గుమ్మడవెల్లి, ఏంపేరు, కుందనపల్లి, వెలిశాల, రామకృష్ణాపూర్ (వి), బోర్నపల్లి, ద్వారకపేట, గర్మిళ్లపల్లి, కలికోట గ్రామాలలో 1400 ఎకరాల లో వరి పంటను సాగు చేస్తున్నారు. అలాగే బావులు, బోర్ల సాయంతో మండలంలో 4100 ఎకరాలలో వరి నాట్లు వేస్తున్నారు. మండలంలోని చెరువుల కింద 2300 ఎకరాలలో సాగు చేయగా మొత్తం 7800 ఎకరాలలో వరి పంటను వానాకాలంలో సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కురిసిన వర్షలతో రైతులు వరిసాగును ముమ్మరం చేశారు.


నిండుగా పారుతున్న చలి వాగు

**వరి సాగు చేస్తున్నా..**



నాకున్న రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా.. చెరువు మొత్తం నిండడంతో ధైర్యంగా వరి పంటను వేస్తున్నా. కొన్ని రోజుల క్రితం చెరువు నిండకపోవడంతో ఆందోళన చెందాను. ఇప్పుడు చెరువు నిండడంతో ధైర్యంగా ఉన్నా.

– గడ్డం కిరణ్, రైతు టేకుమట్ల

# సమస్యలు పరిష్కరించాలి


కాటారం: పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు


చిట్యాల: డాక్టర్ మౌనికకు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

చిట్యాల: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశవర్కర్ల మండల కమిటీ అధ్యక్షురాలు రాధిక కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఒడితల పీహెచ్‌సీ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలని తెలిపారు. ఆశాలకు పని భారం తగ్గించి పారితోషకం లేని పనులు చేయించకూడదని అన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకుడు గుర్రం దేవేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇంత వరకు అమలు కాలేదని అన్నారు. ఇప్పటికైనా ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆస్పత్రి వైద్యాధికారి మౌనికకు వినతిపత్రం అందజేశారు. సుమలత, లక్ష్మి, విజయ, స్వప్న, సరోజన, కమల, రజిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కాటారం: తమ సమస్యలను పరిష్కరించాలని ఆశవర్కర్లు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. చాలా సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు సరిపోక కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. జూలై నెల జీతం చెల్లించడంతో పాటు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలన్నారు. ఫిక్స్‌డ్ వేతనం జీఓ జారీ, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం మండల వైద్యాధికారిణి మౌనికకు ఆశ కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. రాజేశ్వరీ, జయప్రద, పద్మ, రమాదేవి, రుక్సానా, లత, సంధ్య, సరిత, లక్ష్మి, కవిత, నాగమణి, పార్వతి, సమ్మక్క పాల్గొన్నారు.

# వ్యాధులపై అప్రమత్తత అవసరం


మల్హర్: పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


టేకుమట్ల: కేజీబీవీలో..

- డాక్టర్ వినయ్‌భాస్కర్

మల్హర్: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని డాక్టర్ వినయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని రుద్రారం పల్లెదవాఖానలో తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 46 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారి రక్త నమూనాలు సేకరించి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కేజీబీవీలో వైద్యశిబిరం**

టేకుమట్ల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో డాక్టర్ మధురిమ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు వైద్య పరీక్షలు చేసి, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి మందులను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఎక్కువ నీటిని తాగాలని తెలిపారు. పాఠశాల ఎస్ఓ స్వప్న, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, సునీత, కేజీబీవీ ఏఎన్ఎం రజిత, పీఈటీ అనిత, మమత, శైలజ, పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ వాణి అన్నారు. మండలంలోని మేదరమెట్ల గ్రామంలో డాక్టర్ వాణి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. 66 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు, ఇద్దరి రక్త నమూనలను ల్యాబ్‌కు పంపించినట్లు ఆమె తెలిపారు. అనంతరం గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఏఎన్ఎం షబీద, పంచాయతీ కార్యదర్శి శారద పాల్గొన్నారు.

### బీజేపీలో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్ల నారాయణరెడ్డి

కాటారం: మహాముత్తారం మండలం మీనాజీపేటకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం బీజేపీలో చేరారు. కాటారం మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మంథని ప్రజల ఓట్లతో గెలిచి మంత్రి అయిన శ్రీధర్‌బాబు ఈ ప్రాంత ప్రజల సమస్యలను పట్టించుకోకుండా హైదరాబాద్‌కు పరిమితమయ్యారని ఆరోపించారు. గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతం అవుతుందని కేంద్రంలో బీజేపీ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో నూతనంగా చేరిన వారిలో దేవేందర్‌రెడ్డి, సమ్మయ్య, రమేశ్, స్వామి, రాయమల్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం మండల ఇన్‌చార్జ్ సంపత్, మాజీ సర్పంచ్ రాజు, మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్, దుర్గం తిరుపతి, బండం మల్లారెడ్డి, శ్రీశైలం, బొంతల రవి, చీర్ల బాపురెడ్డి, లక్కునాయక్, రాజేశ్, కిషోర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మొగుళ్లపల్లి: హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు పోలు నాగరాజు, ప్రధాన కార్యదర్శి గడ్డం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. 2004 సెప్టెంబర్ 1 నుంచి సీపీఎస్ అమల్లోకి వచ్చిందన్నారు. పాత పెన్షన్‌ను రద్దుచేసి కొత్తగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అమలులోకి వచ్చిన ఈరోజును చీకటి దినంగా పేర్కొంటూ, పెన్షన్ లేనటువంటి వెట్టి చాకిరి విధానానికి వ్యతిరేకంగా మహాధర్నాను తలపెట్టినట్లు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు మహాధర్నాకు తరలిరావాలని తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పింగిలి విజయపాల్ రెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి కుమారస్వామి, మండల కార్యదర్శి చంద్రయ్య, రాజయ్య,సురేందర్, భాగ్యశ్రీ, విజయభాస్కర్, లలిత కళ్యాణి, పద్మ పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత పాటించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీటీ కృష్ణ

కాళేశ్వరం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ అన్నారు. మంగళవారం మహదేవపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాల పరిసరాలలో శుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, విద్యార్థులతో విద్యా సంబంధిత విషయాలపై చర్చించారు.

### తాత్కాలిక డ్రెయినేజీ ఏర్పాటు


డ్రెయినేజీని తవ్విస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ఎస్టీకాలనీలో వర్షపునీరు ఇళ్లలోకి వస్తున్నాయి. దీంతో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ స్పందించి మంగళవారం తాత్కాలికంగా మట్టిని తవ్వి డ్రెయినేజీ ఏర్పాటు చేశారు.

# 'నియోజకవర్గంపై మంత్రి చిన్నచూపు'


కాటారం: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


కాళేశ్వరం: మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కాటారం: సొంత నియోజకవర్గంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిన్న చూపు చూస్తున్నారని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, నాయకుడు జక్కు శ్రావణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సొంత నియోజకవర్గంలో పలు ప్రమాదాల భారిన పడి చనిపోయిన, గాయపడిన వారి కుటుంబాలను మంత్రి పట్టించుకోవడం లేదన్నారు. గతంలో మేడిగడ్డ వద్ద మృతి చెందిన దళిత యువకుల కుటుంబాలకు రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ఇచ్చి సరిపెట్టారన్నారు. కానీ రంగారెడ్డి జిల్లాలో విద్యుత్‌షాక్ దుర్ఘటనలో ఇన్‌చార్జ్ మంత్రి వ్యవహరిస్తున్న శ్రీధర్‌బాబు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలిపారు. కాళేశ్వరం పుష్కరాల విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన మంత్రి సొంత మండంలోని పారిశుద్ధ్య కార్మికుడికి ఇప్పటి వరకు పరిహారం ఇప్పించలేదన్నారు. నియోజకవర్గంలో ఇసుక లారీల ప్రమాద బాధితులు, మేడిగడ్డలో మృతి చెందిన దళిత యువకుల కుటుంబాలకు, పుష్కరాల్లో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పంతకాని సడ్వలి, ఊర వెంకటేశ్వరరావు, కొండపర్తి రవి, సకినాల ప్రశాంత్, గంట సమ్మయ్య, రజాకర్, రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రూ.5లక్షల పరిహారం ఇవ్వాలి**

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గోదావరిలో మునిగి మృతి చెందిన కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని బీఆర్‌ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన మృతులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చారని, సొంత నిజయోజకవర్గం మృతులను మంత్రి శ్రీధర్‌బాబు పట్టించుకోలేదని ఆరోపించారు. అంబట్‌పల్లి మృతులకు న్యాయం చేయాలని అన్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, గీతా, అలీం, మధు తదితరలు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లు పెంచాలి

- ఎమ్మార్పీస్ జిల్లా ఇన్‌చార్జ్ శ్యాంబాబు మాదిగ


మాట్లాడుతున్న నాయకులు

మల్హర్: చేయూత పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీస్ జిల్లా ఇన్‌చార్జ్ మాడిపల్లి శ్యాంబాబు మాదిగ అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం పెన్షన్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులకు, వితంతువులకు రూ. 2వేల నుంచి రూ.4వేలు, దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేలు, కండరాల క్షీణిత బాధితులకు రూ.15000 పెన్షన్ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షుడు కేసారపు నరేశ్, జిల్లా ఇన్‌చార్జ్‌లు దుమ్ము వెంకటేశ్వర్లు, రుద్రారపు రామచంద్రం, జిల్లా యువసేన మంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బురద రోడ్డుపై నాటు వేసి నిరసన


నాటు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్‌లో రహదారి బురదమయంగా మారింది. దీంతో గ్రామస్తులు రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుల్తాన్‌పూర్ మీదుగా వెంకటేశ్వర్లపల్లి, కొనరావుపేట వెళ్లే దారి పూర్తిగా చెడిపోయి గుంతలమయంగా మారిందన్నారు. వర్షాలు పడడంతో రోడ్డు మొత్తం బురదమయంగా మారిందన్నారు. ఏళ్ల నుంచి రోడ్డు ఇలానే ఉన్న మరమ్మతులు చేపట్టడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

### ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

మల్హర్‌లో..



మొగుళ్లపల్లి: కేక్ కట్ చేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు



జిల్లాలోని పలు మండలాల్లో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ యూనియన్ల ఆధ్వర్యంలో మంగళవారం ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ మండే డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కాళేశ్వరం: డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

# ముంపు ప్రాంతాల పరిశీలన


కమలాపురంలో వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట: మండంలో వర్షం తగ్గడంతో నర్సింహాసాగర్ పునరావాస కేంద్రం నుంచి బాధితులను ఇళ్లకు పంపించారు. కమలాపురంలో పునరావాస కేంద్రాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నారు. కమలాపురంలో వరద ముంపునకు గురైన ఇళ్లను తహసీల్దార్ రవీందర్, మండల స్పెషలాఫీసర్ సిద్ధార్థ రెడ్డి, ఎంపీడీఓ భద్రు మంగళవారం పరిశీలించారు. ఇళ్లను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనావేశారు. నష్ట పోయిన బాధితుల వివరాలను నివేదికను ప్రభుత్వానికి అందించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. అనంతరం కమలాపురం జెడ్పీ పాఠశాలలోని పునరావాస కేంద్రంలో బాధితులకు భోజన సదుపాయం, సౌకర్యాలను పరిశీలించారు.

# పుస్తకాల బహూకరణ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

కాళేశ్వరం: మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి మంగళవారం బహూకరించారు. నీట్, జేఈఈ, ఎంసెట్‌లకు సంబంధించిన పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అబ్దుల్ ఘని, రమేశ్, సదానందం, సంధ్యారాణి పాల్గొన్నారు.